క్లుప్తంగా

సీసీరోడ్డు, యూజీడీ పనులు ప్రారంభం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట 24వ వార్డుల్లోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రూ.74 లక్షల వ్యయంతో సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వివిధ పనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో పనులు వేగంగా జరుగుతున్నాయని వైస్ చైర్మన్ పద్మారావు అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అర్కల అనంతస్వామి, మాదాసు వెంకటేశం, నేతలు ఎంబరి ఆంజనేయులు, రంగయ్య, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు పాలుపంచుకోవాలి

కుత్బుల్లాపూర్: అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు పాలుపంచుకోవాలని డీసీసీ మాజీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. సూరారం డివిజన్ శ్రీకృష్ణనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఉన్నికైన శివగుప్త మంగళవారం నూతన కమిటీ సభ్యులతో కలిసి కెఎం ప్రతాప్, యువ నేస్తం వ్యవస్థాపకుడు కేపీ విశాల్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన వారు స్థానికంగా అభివృద్ధి విషయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సమస్యలు తలెత్తకుండా కృషి చేయాలని సూచించారు. సంక్షేమ సంఘం సభ్యులు లక్ష్మణ్, అభిలాష్, బషీర్, కష్టారెడ్డి, యాదయ్య, శీను, నవీన్,యోగి, శివ నాయక్, శంకర్ గౌడ్, లత, లక్ష్మి, కవిత, షీలా, దేవి తదితరులు ఉన్నారు.

బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి



ఇన్‌స్పెక్టర్ కాంత్రికి ఫిర్యాదు చేస్తున్న భరత్‌గౌడ్

జగద్గిరిగుట్ట: టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. మంచిర్యాలలో జరిగిన సభలో రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో టీపీసీసీ ఓబీసీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ గడ్డమీది భరత్‌గౌడ్ ఫిర్యాదు చేశారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం శోచనీయమని కార్పొరేటర్ కె.జగన్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ... యథేచ్ఛగా వెలుస్తున్న బెల్టు షాపుల వల్ల స్థానికులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇదే విషయంపై గత నెల 31వ తేదీన ఎక్సైజ్, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టుషాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళలతో కలిసి పోలీస్‌స్టేషన్ల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీ ట్టమైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. మైసమ్మగూడలోని నర్శింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధి త్రిశూల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంతకుముందు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వివేక్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమ ఏర్పాట్లు చేశారు.

కేటాయించిన నిధులతో పనులు చేపడతాం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.10కోట్లు కేటాయించారని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. పార్లమెంటరీ ఎన్నికల బూత్ స్థాయి సమావేశం మంగళవారం 131 డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హన్మంత్‌రెడ్డి మాట్లాడారు. సీఎం కేటాయించిన నిధులతో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడతామని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించే బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

'గృహజ్యోతి' సర్వే షురూ

- రేషన్, ఆధార్ నెంబర్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- వినియోగదారుల్లో చిగురిస్తున్న ఆశలు



సనత్‌నగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కోసం ఎట్టకేలకు సర్వే ప్రారంభమైంది. స్థానికంగా ఉండే ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు ఉన్నతాధికారుల నుంచి గైడ్‌లైన్స్‌తో రావడంతో మంగళవారం నుంచి ప్రక్రియ షురూ అయ్యింది. ప్రధానంగా రేషన్, ఆధార్ కార్డులను బేరీజుగా చేసుకుని గృహజ్యోతి లబ్ధిదారుల ఎంపికకు శ్రీకారం చుట్టారు. యజమానులు, అద్దె కుండేవాళ్ల తేడా లేకుండా విద్యుత్ బిల్లులు చెల్లించే ప్రతి ఒక్కరి ఆధార్, రేషన్‌కార్డు నెంబర్లను అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే తంతు మొదలైంది.

చిగురిస్తున్న ఆశలు..

గృహజ్యోతి పథకం కింద జరుగుతున్న సర్వేతో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నెలకు 1–200 యూనిట్లు వినియోగించే నివాసితులకు ఈ పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం హామీచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 1–200 యూనిట్లు వినియోగించే గృహ వినియోగదారుల జాబితాను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ముందుగా కరెంటు బిల్లు జారీ అయ్యే ప్రతి కుటుంబం నుంచి రేషన్ కార్డు, ఆధార్‌కార్డు నెంబర్లను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఆ తర్వాత వారు వాడుతున్న యూనిట్ల ఆధారంగా చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అయితే రేషన్‌కార్డు లేని వారి ఆధార్ నెంబర్లను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుండడంతో ఎవరెవరిని లబ్ధిదారులుగా చేరుస్తారనే దానిపై స్పష్టత లేదు. ఎవరికి వారు తమకు లబ్ధి చేకూరుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.



విద్యుత్ మీటర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

వారికే లబ్ధి..

సనత్‌నగర్ సెక్షన్ కార్యాలయ పరిధిలో మొత్తం 27,013 గృహ వినియోగ (డొమెస్టిక్) కనెక్షన్లు ఉండగా ప్రభుత్వం నిర్దేశించిన యూనిట్ల మేరకు శ్యామలకుంట, దాసారంబస్తీ, ఎస్ఆర్‌టీ, శివాజీనగర్, డీఎస్‌ఎంకాలనీ, అశోక్‌కాలనీ తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇక ఎస్సార్‌నగర్ సెక్షన్ పరిధిలో 23,672 డొమెస్టిక్ కనెక్షన్లు ఉండగా ఇక్కడ అమీర్‌పేట కుమ్మరిబస్తీ, రేణుకానగర్, బీజేఆర్‌నగర్, బుద్ధనగర్, సిక్‌బస్తీ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా లబ్ధిదారులు ఉండే అవకాశాలు ఉన్నాయి. బేగంపేట సెక్షన్ పరిధిలో 27,752 డొమెస్టిక్ కనెక్షన్లు ఉంటే బస్తీలు కూడా ఎక్కువగా ఇక్కడే ఉన్నాయి. వీటిలో దాదాపు 50 శాతం లబ్ధిదారులకు గృహజ్యోతి కింద లబ్ధి చేకూరే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. 1–200 యూనిట్లను పరిగణలోకి తీసుకుంటే ఎక్కువ శాతం బస్తీల్లోనే లబ్ధిదారులు ఉంటారు.

మెరుగైన పాలనకు కృషి



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న గోదావరి హోమ్స్ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: రాజకీయాలకు అతీతంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచేందుకు కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కృతజ్ఞత యాత్రలో భాగంగా మంగళవారం జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్, గాయత్రినగర్, బౌద్ధనగర్‌లలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు.

- అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆదరాభిమానాలతోనే తాను హ్యాట్రిక్ విజయం సాధించానన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ మెరుగైన పాలనను అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

నిజాంపేట్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం కమిషనర్ రామకృష్ణరావుతో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమావేశమైన మేయర్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన కొత్త పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ లైన్‌లు, పార్కుల అభివృద్ధితో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్, హార్టికల్చర్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన మేయర్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణరావు

పార్లమెంట్ ఎన్నికల్లో ముస్లింలకు టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు డాక్టర్ హుస్సేన్

సుభాష్‌నగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు ఒక స్థానాన్ని కేటాయించాలని కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం సూరారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుస్సేన్ మాట్లాడారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో పెద్ద సంఖ్యలో ముస్లిం జనాభా ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ స్థానాన్ని మైనార్టీలకు కేటాయించాలని అధిష్టానాన్ని కోరారు. రాష్ట్రంలో 14 శాతం మైనార్టీల జనాభా ఉందని ఈసారి మైనార్టీలకు ఒక అవకాశం ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానందలను కలిశామని తెలిపారు. తమ విన్నపాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని కోరినట్లు పేర్కొన్నారు. మైనార్టీ నాయకులు అమీర్ ఖాన్, సిద్ధిక్, మన్సూర్ అలీ ఉన్నారు.

వాటర్ వర్క్స్ జీఎం ఆకస్మిక తనిఖీలు

నాలా అభివృద్ధి పనుల పరిశీలన

చింతల్: సుచిత్ర, ఉషోదయ జలమండలి సెక్షన్ల పరిధిలో చేపడుతున్న నాలా అభివృద్ధి పనులను మంగళవారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సుచిత్ర సెక్షన్ మేనేజర్ శివప్రసాద్, ఉషోదయ సెక్షన్ మేనేజర్ ఝాన్సీలతో కలిసి ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు. ఉషోదయ సెక్షన్ పరిధిలోని చంద్రగిరినగర్‌లో చేపట్టి 1000 ఎంఎం డయా గల ఆర్సీసీ పైపులైన్ పనులను పరిశీలించిన జీఎం ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా బారికేడ్లను ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అదే విధంగా సుచిత్ర సెక్షన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్–1, ఫేజ్–2 తదితర ప్రాంతాల్లో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ విస్తరణ పనులను సెక్షన్ మేనేజర్ శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. పనులు చేపట్టే ప్రాంతాల్లో బారికేడ్‌లు, రెడ్ రిబన్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో కాంట్రాక్టర్లకు నోటీసులు అందజేయాలని అధికారులకు సూచించారు.



చంద్రగిరినగర్‌లో 1000 డయా పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

8న ఎస్సీ, ఎస్టీల రుణాలపై అవగాహన సదస్సు

నిజాంపేట్: ఎస్సీ, ఎస్టీలకు బ్యాంక్ రుణాలు పొందే విషయమై ఈనెల 8వ తేదీన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ నాయకుడు బాలపీరు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో జరిగే ఈ సదస్సులో కార్పొరేషన్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీలు పాల్గొనాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ ఆత్మహత్య

సుభాష్‌నగర్: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కోరుమిల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణమూర్తి కుమార్తె వేదగణికమ్మ(23)ను సూరారం సాయినగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి మణికంటకు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సమయంలో కట్నకానుకల కింద రూ.7.15లక్షల అమ్మాయి పేరుపై బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌తో పాటు 8 కాసుల బంగారం ఇచ్చారు. సంవత్సరం పాటు వీరి కాపురం సజావుగా సాగింది.



వేదగణికమ్మ (ఫైల్)

- ఇటీవల బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ తేవాలని.. అదనపు కట్నం తేవాలని అత్తమామలతో పాటు భర్త వేధింపులు ప్రారంభించారు. సంవత్సరం పాటు పుట్టింటి వద్దనే ఉన్న వేదగణికమ్మను ఇటీవల మణికంఠ తిరిగి కాపురానికి తీసుకువెళ్లాడు. తల్లిదండ్రులు ఫోన్లలో చెప్పిన మాటలు విని మణికంఠ తిరిగి వేధింపులు మొదలు పెట్టాడు. నైటీ వేసుకుంటే ఎందుకు వేసుకున్నావని కాల్చడం, సెల్ ఫోన్ లాగేసుకోవడం వంటివి చేశాడు.
- ఎప్పటికప్పుడు డబ్బులు పంపినా తిరిగి పంపాలని వేధించడం తండ్రి వద్ద డబ్బులు అడిగి ఇచ్చేది. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన రాత్రి మణికంఠ తండ్రి ఆదినారాయణ మూర్తికి ఫోన్ చేసి వేదగణికమ్మ ఉరేసుకుందని చెప్పాడు. అయితే తమ కుమార్తె ఉరేసుకునేంత సాహసం చేయదన్నారు. అత్తింటి వారే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారులు



స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు, గంజాయి

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 2.2 కిలోల గంజాయి చాక్లెట్లతో పాటు 750 గ్రాముల ఎండు గంజాయిని మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ ఆదేశానుసారం మంగళవారం మధ్యాహ్నం అసిస్టెంట్ సూపరింటెండెంట్ మాధవయ్య నేతృత్వంలో ఎక్సైస్ సిబ్బంది కొంపల్లి పరిధి శ్రీరామాగార్డెన్‌లో జైన్ కన్‌స్ట్రక్షన్స్ సమీపంలోని లేబర్ అడ్డా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ కుమార్, విమల్‌కుమార్ నుంచి 2.2 కేజీల గంజాయి చాక్లెట్లు, 750 గ్రాముల ఎండు గంజాయిని, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి చాక్లెట్లను తమ స్వగ్రామం నుంచి తెచ్చామని తెలిపారు. ఎండు గంజాయిని నానక్‌రామ్‌గూడలో ఉండే నేహా అనే మహిళ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ మెరుగైన పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపట్టాల్సిందిగా రాజు ఆదేశించారు.

సమాజం పట్ల బాధ్యత అంటే ఇదేనేమో.!

- రోడ్డు మరమ్మతులకు స్పందించని అధికారులు
- సొంత ఖర్చుతో మరమ్మతులు చేపట్టిన బీజేపీ నేత



ఎన్‌సీఎల్ కాలనీలో రాకపోకలకు ఆటంకంగా మారిన గుంత

కుత్బుల్లాపూర్: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని.. ఎదురు చూడకుండా రాకపోకలకు ఆటంకంగా ఉన్న రోడ్డు గుంతలను తన సొంత ఖర్చులతో పూడ్చి సమాజం పట్ల తనకున్న బాధ్యతను చాటుకున్నారు కొంపల్లి ఎన్‌సీఎల్‌కు చెందిన బీజేపీ నాయకుడు శివాజీరాజు, మాధురి దంపతులు. కొంపల్లి మున్సిపల్ పరిధి 12వ వార్డు ఎన్‌సీఎల్ నార్త్‌కాలనీ మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోకి వచ్చే ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ దారిపై భారీ గుంతలు ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై శివాజీరాజుతో పాటు కాలనీవాసులు ఆందోళన చేపట్టి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మంగళవారం శివాజీరాజు తానే నడుం బిగించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలకు ప్యాచ్‌వర్క్‌లు చేయించారు. స్థానిక రోడ్డు సమస్య పరిష్కారానికి నోచుకోవడంలో స్థానికులు శివాజీరాజు దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



రోడ్డుపై ఏర్పడ్డ గుంతను ప్యాచ్‌వర్క్ చేయిస్తున్న శివాజీరాజు దంపతులు

నాలాలో చెత్త వేస్తే రూ.10వేలు జరిమానా



బ్యానర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్ నాలాలో చెత్త వేస్తే రూ.పదివేల జరిమానా విధిస్తామని కుత్బుల్లాపూర్ సర్కిల్ పారిశుద్ధ్య విభాగం అధికారులు తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. అయోధ్యనగర్ మీదుగా జీడిమెట్ల పారిశ్రామిక వాడ నుంచి వచ్చే వర్షపు నీటితో పాటు పరిశ్రమలు వదిలే కాలుష్య జలాలు కూడా ఇటు వైపుగా పొంగిపొర్లుతున్నాయి. ఈ క్రమంలో ఇదే నాలాలో పలువురు చెత్తాచెదారాలను వేయడం మూలంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయంపై పారిశుద్ధ్య సిబ్బంది మంగళవారం వివిధ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి



సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు

జగద్గిరిగుట్ట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. జగద్గిరిగుట్టలో బస్ డిపో, మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసురత్నం, మహేష్ మాట్లాడారు. అన్ని పార్టీలు ఎన్నికల సమయంలో తమ మేనిఫెస్టోలో పొందుపరుస్తున్నారని అన్నారు. అనంతరం వాటిని విస్మరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు సహదేవ్‌రెడ్డి, రాజు, ఇమామ్, హరినాథ్ రావు, రాములు, దుర్గయ్య, నగేశ్‌చారి, బాబు, కీర్తి పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు స్పందించాలి

సుభాష్‌నగర్: ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరిచేందుకు కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. మంగళవారం గాజులరామారం పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను ఆయన పరిశీలించారు. ఎక్కడ చూసినా రోడ్లపై మురుగు పారుతోందని, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ధ్వంసం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

పనిచేసే చోటే హాజరు తీసుకోవాలి



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కార్మికులు, సీపీఐ నాయకులు

కుత్బుల్లాపూర్: కార్మికులు పని చేసే ప్రాంతంలోనే హాజరు తీసుకోవాలని సీపీఐ నేతలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఒక ప్రాంతంలో పని చేసే కార్మికులు ఇతర ప్రదేశాలకు వెళ్లి హాజరు వేయడం కష్టంగా మారిందన్నారు. పని చేసే చోటే హాజరు తీసుకోవాలని వినతిలో కోరారు. దీనికి ఉప కమిషనర్ సానుకూలంగా స్పందించనట్లు వారు తెలిపారు. సీపీఐ నేతలు ఉమామహేష్, స్వామి, హరినాథ్, రాములు, కార్మికులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షికి ఘన స్వాగతం



కుత్బుల్లాపూర్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేపట్టిన చలో సిద్దిపేట కార్యక్రమానికి మంగళవారం విచ్చేసిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షికి కొంపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకుడు జెమ్మి దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో మైనంపల్లి హన్మంతరావు, దీపదాస్ మున్షీలకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. మాజీ వార్డ్ మెంబర్ సన్న శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ కావలి గోపాల్, అశోక్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అంజి ముదిరాజ్, బైరి శ్రీను తదితరులు ఉన్నారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మంగళవారం చండీగఢ్‌లోని రాజ్‌భవన్‌లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ దత్తాత్రేయకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ ఆయనతో ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

8 నుంచి సైన్స్ ఫెయిర్

చింతల్: చింతల్ డివిజన్ పరిధి పట్వారి నగర్‌లోని నవజ్యోతి పాఠశాలలో ఈనెల 8, 9 తేదీల్లో రెండు రోజులపాటు (సైన్స్ ఫెయిర్) సైన్స్ ఫియస్టా–2024 నిర్వహిస్తున్నట్లు పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ మలిరెడ్డి ఇందిరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారిని విజయకుమారి, కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి ఆంజనేయులుతో పాటు పలువురు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

శివాలయానికి వెండిబిందె అందజేత

నిజాంపేట్: నిజాంపేట్‌లోని శివాలయానికి బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వాకలపూడి రంగరాయప్రసాద్, సులోచనారాణి దంపతులు వెండి తీర్థపు బిందెను అందజేశారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వారు పరమేశ్వరుడికి అభిషేకం నిర్వహించేందుకు వెండి బిందెను ఆలయ పూజారి గౌతమ్ శర్మకు అందించారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.